కథాకేళి

# వాళ్ళ కోరిక

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ ఇంటి ముందు ఆటో ఆగడంతో గౌతయ్య భార్య కిటికీ లోంచి బయటకి చూసింది. ఆటోలోంచి దిగుతున్న అత్త, మామగార్లని చూసి సంతోషంగా చెప్పింది అన్నం తింటున్న తన భర్త గౌతయ్యకి.

"ఏమండి...మీ నాన్నగారు, అమ్మగారు వచ్చారు."

అతను లేచి చేతిని కడుక్కుని బయటకి వచ్చే సరికి ఆటో ఫేర్ చెల్లించి పెట్టెలతో లోపలికి వస్తున్న తలితండ్రులు ఎదురుపడ్డారు.

"కులాసానా నాన్నగారూ! ముందు ఉత్తరం రాయలేదే?" అడిగాడు ఆనందంగా.

గౌతయ్య భార్య కూడా అత్తగారిని అడిగింది.

"ఇల్లు తేలిగ్గా కనుక్కున్నారా? ఉత్తరం రాస్తే ఈయన స్టేషన్‌కి వచ్చేవారుగా?"

"ముందు స్నానం చెయ్యాలి" చెప్పాడు గౌతయ్య తండ్రి.

ఆయన ఆ గదిలో ఫేన్, లైటు వేసి కోడలు దారి చూపిస్తే బాత్ రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

గౌతయ్య లైటు ఆర్పేసి తల్లితో మాట్లాడసాగాడు. గౌతయ్య తండ్రి స్నానం అయి వచ్చాక గౌతయ్య తల్లి కూడా బాత్ రూంలోకి వెళ్తూ ముందు గదిలోని లైటు, ఫేన్ వేసి వెళ్ళింది. గౌతయ్య లైటు ఆర్పేసాడు. గౌతయ్య తండ్రి పెట్టెలోంచి పంచె, బనీన్ తీసుకుని వాటిని వేసుకున్నాక ముందుగదిలోని టి.వి.ని ఆన్ చేశాడు.

"ఇప్పుడేం రావు నాన్నగారు" చెప్పాడు గౌతయ్య వెంటనే టి.వి. ఆర్పేసి.

"మూర్దాం వస్తాయేమో" చెప్పాడాయన మళ్ళీ టి.వి. ఆన్ చేసి.

"సాయంత్రంగాని ఏదీ రాదండి" చెప్పింది గౌతయ్య భార్య.

ఆయన ఆ గదిలోని లైట్ వెలిగించాడు మళ్ళీ.

"మీకు స్విచ్‌లు తెలియవు" చెప్పాడు గౌతయ్య లైట్ ఆర్పేసి.

గౌతయ్య భోంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. గౌతయ్య భార్య సాయంత్రం దాకా తన అత్త మామలతో తెగ ఇబ్బంది పడింది. మాటి మాటికీ ఆ ఇద్దరు ఇంట్లోని ప్రతి గదిలోని లైటు, ఫేన్ స్విచ్‌లు ఆన్ చేస్తారు అవసరం లేకపోయినా. లేదా టి.వి., ట్రాన్సిస్టర్‌లు ఆన్ చేస్తారు ప్రోగ్రాం ఏదీ రాకపోయినా. లేదా బాత్ రూంలోకి వెళ్ళి టాప్‌ని తిప్పి వస్తారు, నీళ్ళు పోతున్నా లక్ష్య పెట్టక.

వాళ్ళు స్విచ్‌లు వేయడం, టాప్ తిప్పడం, గౌతయ్య భార్య వాటిని ఆర్పడం దాదాపు వంద సార్లు జరిగి వుంటుంది. ఇంటికి రాగానే ఆమె తన భర్తకి రహస్యంగా చెప్పిందా సంగతి.

"ఏమిటండి వాళ్ళిల్లా?" అడిగింది ఆశ్చర్యంగా.

"కొత్తవాళ్ళు కదా. ఏ స్విచ్ ఏదో తెలీక అయి వుంటుంది. ఫేన్ వేయబోయి లైటు వేసుంటారు" చెప్పాడు.

"మరి పంపు?"

"బాత్ రూంకి వెళ్ళి తిప్పి మళ్ళీ ఆర్పడం మర్చిపోయి వుంటారు. నా పెళ్ళయ్యాక నా ఇంటికంటూ రావడం వాళ్ళకిదే మొదటిసారిగా" సర్ది చెప్పాడు గౌతయ్య.

మర్నాడు ఆదివారం. ఆఫీసుకి వెళ్ళకుండా ఇంట్లోనే వున్న గౌతయ్యకి ఆశ్చర్యం వేసింది తన తలితండ్రుల ప్రవర్తన. ఊరికే ఇంటినిండా లైట్లు వేస్తారు పగలే అయినా. బాత్ రూంలో పంపు తిప్పుతారు, నీళ్ళ బిందెలో నీళ్ళు గ్లాసులతో పట్టి పారపోస్తారు.

తన తలితండ్రులు ఆ విషయం మినహా ఇంకే విషయంలోను అసహజంగా ప్రవర్తించడం లేదు. వాళ్ళిద్దరికి పిచ్చిగాని పట్టిందా?" అన్న సందేహం కలిగింది గౌతయ్యకి. అతని భార్య కూడా అదే అనుమానం వ్యక్తం చేసింది.

"ఏవిటిది నాన్నగారూ? ఎందుకిలా లైట్లు వేస్తున్నారు?" అడిగాడు మధ్యాహ్నం వుండబట్టలేక.

ఆయన బదులుగా నవ్వి పక్క గదిలోకి వెళ్ళి ఆ గదిలో ఆర్పిన లైటు వెలిగించాడు కాని జవాబు చెప్పలేదు. తల్లిని అడిగాడు ఆవిడా నర్మగర్భంగా నవ్వి చెప్పింది.

"మీ నాన్నగారిని అడుగు"

సాయంత్రం అయేసరికి గౌతయ్యకి ఓపిక నశించింది. కాని స్వయాన తలితండ్రులు. వాళ్ళమీద అరవలేదు. రాత్రి భోజనాల దగ్గర అడిగాడు గౌతయ్యని అతని తండ్రి.

"నాకు చిన్నప్పటి నుంచి ఓ కోరిక వుండేదిరా. ఆదివాళ తీరింది."

"ఏమిటది?" అడిగాడు గౌతయ్య.



"నీకు గుర్తుందో లేదోగాని నీ చిన్నప్పుడు నువు పుదయం లైట్లువేసేవాడివి. బాత్ రూంలో పంపు తిప్పి, ఇంట్లో బిందెల్లో నీళ్ళు పారపోసి తెగ గొడవ చేసేవాడివి. చెప్తే వినిపించుకునేవాడివి కావు. అప్పుడు మేం పడ్డ బాధ ఎలా వుంటుందో నీకు తెలియాలంటే, నీకంటూ ఓ ఇల్లు ఏర్పడ్డాక నీ ఇంటికొచ్చి నేమూ సరిగ్గా అలాగే చేయాలని" చిరు నవ్వుతో చెప్పాడాయన.

"ఎంత విసిగించావో, ఇప్పుడర్థమయిందా?" నవ్వింది గౌతయ్య తల్లి కూడా.

గౌతయ్య, అతని భార్య వెంటనే ఒకరి వంక మరొకరు చూసుకున్నారు.

తర్వాత ఇద్దరూ ఫక్కున బయటికి గట్టిగా నవ్వేశారు. ●



16-6-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక